ఆకస్మాత్తుగా బస్ స్టాపులో కనపడ్డ సుమిత్రను చూసి ఆశ్చర్య పోయాను. 'పలకరిద్దామా, వద్దా' అనుకుంటూండగానే తనే దగ్గరకు వచ్చి, "గుర్తున్నానా?" అంది.




పద్దెనిమిదేళ్ళ తరువాత కూడా సుమిత్రను సులభంగానే గుర్తు పట్టగలిగాను. వయసుతో వచ్చిన కొద్ది మార్పులే తప్ప పెద్ద మార్పులేమి లేవు ఆమెలో.

''లేకేం?'' అన్నాను. పొడిగా. ఇన్నేళ్ళ తరువాత కలుసుకున్నా ఆమెతో మాట్లాడాలనిపించ లేదు—మనసులో పేరుకున్న అసహ్యంవల్ల కాబోలు. ఆమే మళ్ళీ పలకరించింది. 'ఈ వూరి కెప్పుడొచ్చావ్' అని నే చెప్పాను. ''ఇంకా ఉంటావా ?''

''ఎల్లుండి వెళ్ళిపోతున్నాం.''

''నీతో ఓమారు మాట్లాడాలి. నేనున్న చోటికి రాగలవా?'' అంది మళ్ళీ.

''అంత అవసరమా? ఇక్కడే చెప్పు పోనీ'' అన్నాను.

''కాదులే. నీ కిష్టం లేనట్టుంది. కాని మన పాత స్నేహాన్ని పురస్కరించుకుని ఒక్కసారి రా. ఇదిగో అడ్రసు. మూడో నంబరు బస్సు ఎక్కావంటే అక్కడే దిగుతావ్. లేదంటే ఇప్పుడేం తొందర పనుల్లేకపోతే నాతోనేరా.''

''ఇప్పుడు వీలుపడదు, సుమిత్రా. రేపు తప్ప

కుండా వస్తానని" అన్నాను. అంతలో ఆమె ఎక్క వలసిన బస్సు వచ్చింది. "తప్పకుండా వస్తావు కదూ? నీ కోసం ఎదురుచూస్తూ ఉంటాను." అంటూ బస్సెక్కింది. బస్సు వెళ్ళిపోయింది. నేను వెళ్ళాల్సిన బస్సు ఇంకా రాలేదు. ఆవిచ్చిన అడ్రస్ కాయితం విప్పి చూశాను.

'అనాధాశ్రమ బసవనగుడి' అని ఉంది. అయితే అనాధాశ్రమంలో ఉందన్నమాట! ఇదా కథ? అనుకున్నాను.

ఇంటికి వచ్చాక కూడా ఆ రోజంతా సుమిత్రే నా మనసులో మెదల సాగింది.

ఇప్పటి సంగతా? సుమారు ఇరవై రెండేళ్ళ క్రిందటిమాట. అప్పుడే సుమిత్ర నవ వధువుగా మా వూళ్ళో అడుగు పెట్టింది. మూర్తి మాకంతా బాగా తెలిసిన వాడవటంచేత నేనూ వెళ్ళా నా రోజు వాళ్ళింటికి. పెద్ద పెద్ద కళ్ళతో అందంగా ఎర్రగా, తీగలా ఉన్న సుమిత్ర నన్నెంతో ఆకర్షించింది. మూర్తి అదృష్టవంతు డనుకున్నాను.

బాగా చదువుకున్న సుమిత్రకు కొద్దిగానైనా చదువుకున్న నేనంటే ఎంతో ఇష్టం. రోజూ వాళ్ళింటికి రమ్మని పోరు పెట్టేది. నేను రాక పోతే తనే వచ్చేసేది. ఇక పుస్తకాల గురించి సినిమాల గురించి బోలెడు కబుర్లు చెప్పుకునే వాళ్ళం. మా కిద్దరికీ మంచి స్నేహం ఏర్పడింది. ఆ తరువాత సంవత్సరానికి విజ్జి పుట్టింది. నాకు పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయాను. మా వారికి దూర ప్రాంతాల్లో ఉద్యోగమవటం వల్ల మళ్ళీ మూడేళ్ళకుగాని రాలేకపోయాము. కాని, రాగానే అంత ఘోరమైన వార్త వినాల్సి వస్తుం దని కలలో కూడా అనుకోలేదు.

సుమిత్ర లేచిపోయింది!

మూడేళ్ళపాప విజ్జిని కూడా విడిచి వెళ్ళి పోయింది. నమ్మలేకపోయాను. మూర్తితో ఏం మాట్లాడాలో తెలియక వాళ్ళింటివైపే వెళ్ళటం మానేశాను. కాని ఇక మళ్ళీ వూరెళ్ళిపోతున్నా నన్న వుడు మూర్తిని, విజ్జిని చూడాలన్న కోర్కెను అపుకోలేకపోయాను.

నేను వెళ్ళేసరికి మూర్తి విజ్జిని నిద్ర పుచ్చుతున్నాడు. నన్ను "రామ్మా, కూర్చో" అన్నాడు. మౌనంగా కూర్చున్నాను. కుశల ప్రశ్నలు వేశాడు. తన సంగతులేం మాట్లాడలేదు. అతన్ని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోయింది. మొహమంతా పీక్కుపోయింది. ముప్ఫై రెండేళ్ళకే ముసలితనం వచ్చినట్లు కనిపిస్తోంది. అతడిని ఈ స్థితికి తెచ్చిన సుమిత్రమీద చెప్పలేనంత ఆగ్రహమూ, అసహ్యమూ కలిగాయి. ఆవేశంతోనే అన్నాను.

"అఖరికి సుమిత్ర ఇంత పని చేస్తుందనుకోలేదన్నయ్యా"

మూర్తి తొణకలేదు. మెల్లిగావచ్చి నా కెదురుగా కుర్చీమీద కూరున్నాడు. అతడి మొహాన్ని విరాశా, నిస్పృహా ఆవరించాయి.

"పాపిష్టిది. కనీసం బిడ్డ మొహమైనా చూడలేదు"

"అలా అనకమ్మా తప్పంతా నాదే. నేనే సుమిత్రకు తీరని ద్రోహం చేశాను. తల్లీ, తండ్రీ లేని పిల్లను నా చేతుల్లో పెట్టాడు. వాళ్ళ మామయ్య. ఏం సుఖ పెట్టాను. నేను? ఆఖరికిలా అయింది. ఎక్కడుందో, ఎన్ని బాధలు పడుతోందో!" అన్నాడు మూర్తి కిటికీలోనుండి బయటకు చూస్తూ.

"తనకే పెద్ద బుద్ధులు వుడితే నువ్వేం చేస్తావు మధ్యన?" అన్నాను కోపంగా.

"నీకు తెలీదమ్మా. అంతటికీ నేనే కారణం. తన కోర్కె లేమిటో, ఆశ లేమిటో గ్రహించాలన్న ధ్యాసే లేకపోయింది నాకు. వాటి కోసమే తపించి ఇలా వెళ్ళిపోయింది సుమిత్ర. పట్టి అమాయకురాలమ్మా. నీకు తెలీదు. తప్పంతా నాదే" బయటకు రాబోతున్న కన్నీటిని తుడుచుకున్నాడు మూర్తి.

"ఇక చాల్లే అన్నయ్యా. లేనిపోని నిందలు నెత్తిన వేసుకోకు. అంతమాత్రానికే ఇల్లు వదిలి వెళ్ళిపోతారా? అసహ్యం వేస్తుంది వింటే. నీలాంటి వాడు దొరకాలంటే తపస్సు చెయ్యాలి"

మూర్తి ఇంకేం మాట్లాడలేదు. ఇక వెడతానని లేచినపుడు చెప్పాడు.

"ఈ వూరు వదిలి పెట్టాలనుకుంటున్నా నమ్మా. 'విజ్జికి బాగా చదువు చెప్పించాలి' అంటూండేది వాళ్ళమ్మ. పట్నం వెళ్ళి అక్కడే ఉండి పోదామనుకుంటున్నా."

మళ్ళీ మూడేళ్లకు, నాలుగేళ్ళకు పట్నం వెళ్ళినపుడల్లా విజ్జి, మూర్తులను చూసేదాన్ని విజ్జి ఎంతో ప్రేమతో 'పిన్నీ, పిన్నీ' అంటూ నావెంటే తిరిగేది. విజ్జి పెద్ద పెద్ద కళ్ళు, అందమయిన మొహం సుమిత్రనే గుర్తుకు తెచ్చేవి నాకు. కాని సుమిత్రలో లేనిది విజ్జిలో ఉన్నదీ ఒక్క గాంభీర్యమే. అంత చిన్న పిల్ల కుండవలసింది కాదది. అలా అనుకున్నపుడల్లా సుమిత్రమీది అసహ్యం పెరిగి పోయేది నాలో.

ఇపుడు అయిదేళ్ళుగా పట్నంలోనే ఉంటున్నాం. మేము. విజ్జి బి. ఏ. చదువుతోంది. మూర్తికి వంట్లో ఏమంత బాగుండటంలేదు. ఆ తండ్రీ కూతుళ్ళ మధ్యనున్న ప్రేమ వాత్సల్యాలను చూస్తూ ఉంటే నా కళ్ళు చెమ్మగిల్లేవి. తల్లి తన బిడ్డను చూసినట్టు చూసేది విజ్జి తండ్రిని. బుజ్జగించి మందులు తాగించేది. సాయంత్రాలు ఎక్కడికీ వెళ్ళకుండా తండ్రి దగ్గరే కూర్చుని ఏవో చదివి వినిపిస్తూండేది.

ఒక్కటిమాత్రం కనిపెట్టాను. విజయకు వాళ్ళమ్మ అంటే అపరిమితమయిన అసహ్యం అని. అందుకే నే నెప్పుడూ తన ముందు సుమిత్ర పేరెత్తేదాన్నికాదు. మూర్తి కూడా అంతే నను కుంటాను. ఒకరోజు విజ్జి లేకుండా చూసి అన్నాడు

"బతికి ఉంటే ఒక్కమారన్నా వచ్చేదే"

మూర్తి సుమిత్రను ఎన్నటికీ మర్చిపోలేదు. అనుకున్నాను.

ఈ సంవత్సరం వేసంగి సెలవులకూ అన్నయ్యున్నాడుకదాని ఈ వూరికి వస్తే అకస్మాత్తుగా సుమిత్ర తటస్థించింది. ఆ రాత్రి వెళ్ళనా వద్దా అనుకోవటంతోనే తెల్లవారింది.

* * *

మరునటిరోజు సాయంత్రం సుమిత్ర చెప్పిన అడ్రసు వెతుక్కుంటూ వెళ్ళాను. ఆ అనాధాశ్రయాన్ని సులభంగానే కనుక్కో గలిగాను. నా కోసం ఎదురు చూస్తోందేమో, గేటు దగ్గరే ఎదురొచ్చి లోపలికి తీసుకుని వెళ్ళింది సుమిత్ర. నలుగురు పిల్లలు "అమ్మా, అమ్మా" అంటూ వచ్చి ఏదో చెప్పి వెళ్ళిపోయారు సుమిత్రతో.

"పిల్లలంతా........" అన్నాను.

"నా పిల్లలేనా అని అడగబోతున్నావ్ కదూ? అవును. ఇంకా చాలా మందున్నారు. ఇక్కడి మేట్రిన్‌నేను" అంది సుమిత్ర.

"ఓ" అనుకున్నాను. ఎందుకోసం మూర్తిని వదిలిపెట్టి ఈ స్వర్గాన్ని చేరుకుందో అడగాలనుంది నా మనసులో. కాని ఎలా అడగాలో తోచక మౌనం వహించాను.

"నా కథంతా తెలుసుకోవాలని లేదూ?" అంది సుమిత్రే మళ్ళీ మొదటనుండి మనసులోని భావాలను చదవటం సుమిత్ర కలవాటే. అది ఇప్పటికీ అలాగే ఉందన్నమాట.

"నీ కభ్యంతరం లేకపోతే అంత సహృదయుడయిన భర్త నెందుకు మోసగించావో తెలుసుకోవాలనుంది" అన్నా. నా కంఠంలోని కాఠిన్యం దాగలేదు. సుమిత్ర కళ్ళలో ఏదో నాకు తెలియని భావం మెరిసి మాయమైనట్టు కనిపించింది.

"నేనంటే నీ కసహ్యమని నాకు తెలుసు. కాని నా కథంతా ఇంతవరకూ ఎవరికీ చెప్పలేదు. నీకు చెప్పాలనిపించింది. అవసరముంది కూడా......" అని ఆగింది.

సరే నన్నట్టు తలూపి వినటానికి సిద్ధంగా కూర్చున్నాను.

"ఆయనంటే నీ కెంతో అభిమానమని నాకు తెలుసు. నా కర్మకు ఆయన్ను నిందించటం నా ఉద్దేశ్యంకాదు. కాని ఆయన పెళ్ళే చేసుకోకుండా ఉండాల్సింది......"

"నే నేదో చెప్పబోయాను.

"దయచేసి చెప్పేదంతా విను సరళా. నేను నా చిన్నతనం—లోనే తల్లిని, పదహారో ఏట తండ్రినీ పోగొట్టుకున్నాను. తల్లి దండ్రుల ప్రేమానురాగాలకు నోచుకోనిదుర దృష్టవంతురాల్ని రెండో సంబంధమయినా పెద్ద వయసుకాదని, బోలెడు ఆస్తి ఉందని ఈ సంబంధం నిశ్చయించినప్పుడు నేను కాదనలేదు. కాని మా దాంపత్యంలో నేను సుఖపడ్డ రోజు ఒక్కటి కూడా లేదంటే నమ్మలేవు. ఆయన నన్నెంతో ఆప్యాయంగా ఆదరించారు. కాని అనురాగంతోకాదు. రోజంతా సాయంకాలానికోసం ఎదురు చూసేదాన్ని. ఆరాటాన్ని, ఆహ్వానాన్ని, అనురాగాల్ని కళ్ళలో నింపుకుని ఆయన కోసం అలమటించేదాన్ని. కాని ఆయనెప్పుడూ! వీటిని గమనించేవారేకాదు. గమనించినా ఏమీ చెయ్యలేనట్టు నిస్సహాయులుగా ఉండిపోయేవారు. భోజనాలవగానే గదిలోకి వెళ్ళి పుస్తకం ముందేసుకుని, ఇక నేను నిద్రపోయేదాకా అదే చదువు. నేను చదువుతున్న ఆయన మొహంలోకి చూస్తూ కూర్చునేదాన్ని. ఒక్కోసారి మనసులోని కోర్కెలు పడగలు విప్పితే ఓర్చుకోలేక పడకమీద పడి వెక్కి వెక్కి ఏడ్చేదాన్ని. అప్పుడు దగ్గరకు తీసుకుని,

"పిచ్చిపిల్లా ఎందుకేడుస్తావ్" అని ఓదార్చేవారు. ఒక్కోమారు "నిన్ను బాధ పెడుతున్నాను కదూ? కాని ఏం చేయను......" అని వాపోయేవారు. నా తలమీద చెయ్యివేసి నిమురుతూ ఉంటే చనిపోయిన నాన్న ఆప్యాయత గుర్తుకొచ్చేది. కాని నాక్కావలసినది ఆప్యాయతకాదు, అనురాగం.

# మీకు చాలా ఉపయోగం

తేలు కుడితే కళ్ళల్లో కుంకుడుగింజపప్పు సమిలితే బాధ వెంటనే పోతుంది. నిత్యజీవితాని కుపయోగించే ఇలాంటి 200 అద్భుత రహస్యాలు 'చేతివనులు' పుస్తకంలో ఉన్నాయి. అతి శీఘ్రంగా మంచిబలానికి, పిప్పిపంటి పోటుకి, మొటిమలకు, మూలశంకకు, శరీరపొప్పలకు, నరాల బలహీనతలకు, గుండె బలానికి, వాటన్నిటి పోగొట్టే వి, ఇలాంటివెన్నో సులువుగా, స్వంతంగా చేసుకొనే పద్ధతులందున్నాయి. ఇంకా అత్తర్లు, తలనూనెలు, సబ్బు, సిరా, టూత్‌పేస్టు, పౌడర్లు మొదలయినవన్నీ చేసే పద్ధతులున్నాయి. 'చేతివనులు' అనే ఈ పుస్తకం చాల ఉపయోగకరమైనదిగా ఉన్నదని 3-8-62 ఆంధ్రప్రభ వ్రాసింది. వెల రు. 3-50 నయాపైసలు. పోస్టు ఖర్చులు ఉచితం. ఇది క్రిందిచోట మాత్రమే దొరుకును. దేశసేవ ప్రచురణలు, ఏలూరు, వ్రాస్తే వి. పి. పోస్టులో వెంటనే మీకుకూడా ఒక పుస్తకం పంపబడును.

SWASTIK





# పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళవివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో, ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధినిక్షేపములు, లాటరీ, ఆకస్మిక ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు.1.25న. పై. లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం). దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTHISHI (A.W.P)
P. B. 86, JULLUNDUR CITY.







# వంచిత

అది నాలో స్పందనను కలిగించాలి. అతడు నన్నే సర్వస్వం అనుకుని నాలోని కోర్కెలన్నీ, ఆవేదననూ అర్థం చేసుకుని మెలగాలి. ఒక్కోమారు ఆయన గుండెలమీద తల పెట్టుకుని నాలోని ఆవేదనవంతా వెళ్ళబోసుకోవాలనిపించేది. ఎప్పుడో గాని ఆ అవకాశమూ లభించేదికాదు. అప్పుడు ఆయన గుండెలమీద తల పెట్టుకుని నిరవంగా రోదించే దాన్ని. ఇంతకూ ఈయన అనాదరణకు కారణమేమిటో ఒకరోజు తెలిసింది. "నిర్మలను మర్చిపోలేకుండా ఉన్నాను" అన్నారు. నాలోని సహనం కట్టలు తెంచుకుంది.

"అయితే నన్నెందుకు పెళ్ళి చేసుకున్నారూ? ఇలా అన్యాయం చెయ్యడానికేనా?" అని రెట్టించాను.

"నిజమే నీ కన్యాయమే జరిగింది. కాని అది నేను కావాలని చేసిందికాదు. నేను మానసికంగా మునలి వాడి నయ్యానన్న సంగతి నా కప్పుడు తెలియదు. నలుగురూ పెళ్ళి చేసుకోమని బలవంత పెడితే చేసుకున్నాను. నిన్నింత బాధ పెడుతున్నందుకు నా మనసు క్షోభిస్తోంది"

ఆయన మొహం చూస్తే జాలి, అసహ్యం, కోపం అన్నీ పెనవేసుకుని బయటికి పొంగసాగింది. ఆయనముందు నిల్చోలేక పారిపోయాను. అప్పటికే విజ్జి పుట్టింది. ఇక పాపే నా సర్వస్వం అనుకుంటూ నిర్లిప్తంగా జీవించటానికి నిర్ణయించుకున్నాను. కాని అప్పుడే ఆ వూరికి టీచర్‌గా వచ్చిన మాధవ్‌తో పరిచయమయింది. అనుకోని మార్పులు వచ్చాయి. నాలో అణగి మణగిన కోర్కెలు విజృంభించాయి. సులభంగానే అతడికి లొంగిపోయాను. నన్నారాధించి స్వర్గం చవి చూపించాడు.

"ఈ కట్టడిలో నిన్నెలా పూజించను? నాతో వచ్చేయి" అన్నప్పుడు వెనుదిరిగి చూడకుండా కళ్ళు మూసుకుని అతడివెంట నడిచాను.

తలెత్తి సుమిత్రవైపు చూశాను. గత స్మృతితో ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. యౌవనం దిగజారిపోయినా, ఆ తాలుకు అందం ఆమెను వీడలేదనిపించింది.

"నరళా ఇదంతా చెప్పటానికి నాకు సిగ్గు వెయ్యటంలేదు. నేను ఆయనకు ద్రోహం చేశానని కూడా అనిపించటంలేదు. నేను నమ్మి వచ్చిన తను జీవితంలో మాధుర్యమంటే ఎలా ఉంటుందో చవి చూపాడు—కొద్ది రోజులైతే మాత్రమేం అవే నాకు మధుర క్షణాలు.

"ఒకరోజు ఇంటికి తిరిగి పొమ్మని చీటీ రాసిపెట్టి తన త్రోవ చూసుకున్నాడు. అందుకని అతడిని నిందించను నేను. అతడికీ ఇల్లూ, ఇల్లాలూ కావాలనిపించి ఉంటుంది. వెళ్ళిపోయాడు. ఇక నాకు మిగిలిందేమిటి? జీవితంలో ఇంకేం ఆశా లేదు. విజ్జిని మాత్రం ఒక్కసారి చూడాలనిపించింది. ఆ ఆశను మనసులోనే దాచుకుని ఈ జీవితాన్ని చాలించాలనుకున్నాను. కాని ఈమె అడ్డుపడింది......"

అంటూ ఆ గదిలోనే ఉన్న ఫోటో చూపించింది సుమిత్ర.

"నన్ను తీసుకొచ్చి కన్న తల్లిలా ఆదరించింది నేను చదువుకున్న చదువు అక్కరకొచ్చిందప్పుడు. ఈ అనాథాశ్రమానికి మేట్రన్ ఆమె. నేను సహాయకు

కాలిగా చేరాను. అప్పటినుండి ఇక్కడే ఇలాగే జీవిస్తున్నాను.

"కాని నేను చేసిన పాపమల్లా ఒక్కటే. తల్లి ప్రేమలేని లోటు ఎంతటిదో తెలిసి కూడా విజయని తల్లిలేనిదాన్నిగా చేశాను. అదే నన్ను రంపపు కోత పెడుతోంది. ఒక్కసారిమాత్రం విజ్జిని చూడాలన్న కోర్కె చావుకోలేక వూరికి వెళ్ళాను. ఇంటికి తాళం వేసి ఉంది. ఎవరినయినా అడిగితే గుర్తు పడతారేమోనని అలాగే తిరిగి వచ్చాను. ఇదీ నా కథ" అంటూ ఆపింది సుమిత్ర. నా కళ్ళలోని నీరు ఆమెకు కనపడుతుందేమోనన్న భయంతో తలవంచుకుని టేబిల్‌మీది పుస్తకంమీద దృష్టి నిలిపాను.

"ఇపుడు వారెక్కడున్నారో తెలుసా......?" సుమిత్ర కంఠం వణికింది. నేను తెప్పరిల్లుకుని "మద్రాసులోనే ఉంటున్నారు" అన్నాను.

"అమ్మాయి ఎలా ఉంది?" అంది కిటికీలో నుండి బయట అలుముకున్న సంజ చీకట్లను చూస్తూ.

"అచ్చం చిన్నప్పటి నీలాగే ఉంది" అన్నా విజయను తల్చుకుంటూ.

"కాని ముక్కుమటుకు వాళ్ళ నాన్నదే."

"నిజమే" అన్నాను ఎంతయినా తల్లి హృదయం అనుకుంటూ.

అప్పటికిగాని సుమిత్ర ఏదో చెప్పాలని నన్ను పిలిపించిందన్న విషయం గుర్తుకు రాలా. ఇప్పుడు కారణం లీలగా అవుపిస్తోంది. విజయ కళ్ళలోని గాంభీర్యం నా మనసులో మెదిలింది.

"విజ్జి ఇప్పుడు బి. ఏ. చదువుతోంది. మూర్తి ఆరోగ్యం ఏమంత బాగుండటం లేదు."

"నే నొక్కటడగాలనుకుంటున్నా"

సుమిత్ర ఏమి టడగబోతోందో వూహించుకుని నా మనసు కలవర పడింది.

"విజయ నోమారు చూడాలని ఉంది. వీలు పడుతుందా?"

అమాయకంగా కనిపించే విజయ పెంకితనం గుర్తుకొచ్చింది. వీలుపడుతుందని ధైర్యంగా చెప్పలేకపోయాను.

"ఇక్కడ పిల్లలంతా నన్ను 'అమ్మా' అనే పిలుస్తారు. నేనూ వాళ్ళల్లో విజయనే చూసుకుంటున్నాను. అయినా సంతృప్తి కలగలేదు. విజయ నోమారు చూడాలనుకోవటం తప్పంటావా?

"మూర్తిని చూడాలని లేదా?"

"లేదు......లేదు......" అంది తడబడుతూ.

"విజయను మాత్రం చూడాలని ఉంది. బహుశా అమ్మాయికి నేనంటే అసహ్యమేననుకుంటా" సుమిత్ర కళ్ళలో నీరు తిరిగింది. జాలి వేసింది. నాకు సుమిత్రను చూసి కాదు. ఆమె మొహంలో జ్వలిస్తున్న మాతృమూర్తిని చూసి, లేచి ఆమె బుగ్గలమీదుగా ప్రవహిస్తున్న కన్నీటిని తుడిచాను. నా కళ్ళలో నీరు ప్రవహించి లోపల గడ్డ కట్టుకున్న అసహ్యాన్నంతా తుడిచి వేసినట్టనిపించింది. కాని విజయతో పరిచయం బాగా ఉన్న నాకు వాళ్ళ మధ్యకు సుమిత్రను తీసుకుని వెళ్ళి నిలబెట్టే సాహసం కలగలేదు.

"అక్కడి పరిస్థితులను చూసి వీలునుబట్టి ఉత్తరం రాస్తాను. అప్పుడు వద్దువుగాని" అన్నాను.

"కాని నే నెవరో తెలియ నివ్వకుండా దూరం నుంచే విజ్జిని చూసి సంతృప్తిపడి వచ్చేయలేను. ఒక్కసారి 'అమ్మా' అని పిలిపించుకోవాలని' దగ్గరకు తీసుకోవాలని నాలో ఉధృతంగా ఉన్న కోర్కె బయట పడవచ్చు. విజయ నన్ను గుర్తించినా ప్రమాదం లేదనిపిస్తేనే రాయి. లేదంటే...... ఇలాగే శేష జీవితాన్నంతా గడిపెయ్యగలనులే. వీళ్ళంతా నా పిల్లలే......మరేం పర్వాలేదు."

"కొత్త సమస్య వచ్చి పడింది. ఏం చెప్పాలో తెలియలేదు. నాకు తెలిసినంతవరకూ సుమిత్ర కోర్కె తీరే అవకాశంలేదు.

"సరేలే ఉత్తరం రాస్తానుగా" అంటూ బరువుగా సెలవు తీసుకున్నాను.

ఊరికి వచ్చి నాలుగు రోజులయినా విజయనీ, మూర్తినీ కలుసుకోవటం పడలేదు. నెల రోజులుగా వదిలి వెళ్ళిన ఇంటిని సర్దటంలోనూ, పిల్లల స్కూలు గొడవలలోనూ సరిపోయింది.

అయిదో రోజు తీరిక చేసుకుని వెళ్ళాను. మూర్తి శాలువా కప్పుకుని పడక కుర్చీలో కూర్చున్నాడు. విజ్జీ కూడా అక్కడే బత్తాయి పళ్ళ రసం తీస్తూ కూర్చుంది. ఇద్దరూ ఏదో వాదించుకుంటున్నట్టున్నారు. నేను వెళ్ళగానే.

"రా పిన్నీ, ఎప్పుడూ రావటం వూరినుండి" అంటూ పలకరించింది విజయ వెంటనే.

"చూడు పిన్నీ. కొద్ది రోజులు మన వూరికి వెళ్ళి ఉందామంటే ఒప్పుకోవటం లేదు నాన్న" అంటూ ఫిర్యాదు చేసింది.

నవ్వుతూ కూర్చున్నాను.

"అయితే అమ్మాయి చెప్పిన మాట వినటం లేదన్నమాట నాన్నగారు. ఆరోగ్యం బాగుపడుతుందంటే రెండు రోజులు వెళ్ళిరాకూడదా అన్నయ్యా?" అన్నాను.

"అలా చెప్పు పిన్నీ" అంటూ మూర్తి పళ్ళ రసం తాగి కింద పెట్టిన గ్లాసు తీసుకుని లోపలకు వెళ్ళింది విజయ.


"అదికాదమ్మా. నేను విజయను ఎంత బాధ పెడుతున్నానో చూశావా? ఎలా ఉండాల్సిన పిల్ల. నలుగురు స్నేహితులతో కలిసి తిరగదు, ఎప్పుడూ నన్నంటిపెట్టుకునే ఉంటుంది. విజయకి తల్లి లేకుండా చేశాను. నేను ఉండీ బాధ పెడుతున్నాను."

"ఇప్పుడు అకస్మాత్‌గా సుమిత్ర కనిపిస్తే?"

నా నోట మాట జారింది.

మూర్తి ముందుకువంగి అన్నాడు. "ఏమిటి? సుమిత్రా! ఎక్కడ?...... లేదమ్మా, సుమిత్ర బతికిఉంటే ఒక్కసారైనా వచ్చేదే. కనీసం విజ్జికోసమైనా రాదా?......ఊహూ...... ఇక అక్కడే కలుసుకోవటం......" మాట పూర్తి చేస్తూండగానే అతని మొహం వివర్ణమయింది. కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. గాబరా పడ్డాను నేను. అప్పుడే లోపలకు అడుగుపెట్టిన విజ్జి చప్పున ముందుకువచ్చి పట్టుకుంది. ఇద్దరం కలిసి నెమ్మ

35 వ పేజీ చూడండి



"ఇంకా ఎంతసేపో నీ సింగారింపూ? అవతల షో బిగినై పోయుంటుందీపాటికి!!"
"అబ్బబ్బ! గంటల తరబడి చెబుతున్నా, ఒక్క నిముషంపాటు ఆగండీ అని....??!"

దిగా మంచంమీద పడుకోబెట్టాం. నాకం చెయ్యాలో తోచటంలేదు. విజయ చన్నీటితో తండ్రి మొహం తుడిచింది. మెల్లిగా విసన కర్రతో విసర సాగింది. కాస్సేపటికి కళ్ళు తెరిచాడు మూర్తి.

"ఎలా ఉందన్నయ్యా" అన్నాను.

మరేం ఫరవాలేదమ్మా. అపుడపుడు ఇలా వస్తూనే ఉంటుంది" అన్నాడు విజయ బీరువాలోనుండి రెండు మాత్రలు తెచ్చి మింగించి నీళ్ళు తాగించింది. "ఇక కాస్సేపు మాట్లాడకుండా పడుకోవాన్నా" అంది.

ఇంతసేపయ్యాక విజయ నా వైపు చూసింది. చూపుతో ఉన్న భావం గమనించి తప్పు చేసిన దానిలా తల వంచుకున్నాను. కొంపదీసి మూర్తితో నే నన్న మాటలు వినలేదుగదా అనుకున్నాను.

బయటికివచ్చి మూర్తి ఆరోగ్యం గురించి కాస్సేపు మాట్లాడి ధైర్యం చెప్పి "ఏం అవసరమొచ్చినా నాకు కబురు చెయ్యటం మరవకు" అని చెప్పి వచ్చేశాను.

అలా వచ్చేశానేగాని నా మనసులో కలతగానే ఉంది. నేను యథాలాపంగా అన్నమాటలు విజయ విందా లేదా? సుమిత్ర గురించి విజయకు చెపితే పరిణామం ఎలా ఉంటుంది? అన్న ఆలోచనలతోనే యాంత్రికంగా ఇంటిపనులు చేసుకో సాగాను.

మరుసటిరోజు ఉదయం ఇంకా అప్పుడే తెల్లవారింది. నిద్రలేచి కాఫీ నీళ్ళు పడేస్తున్నా. బయట విజయ గొంతు వినపడింది. పనిపిల్ల గాబోలు తలుపు తీసినట్టుంది. ఇంకో నిమిషంలో "పిన్నీ" అంటూ లోపలకు అడుగు పెట్టింది. విజయ. భయాన్ని అణచుకుంటూ విజయవైపు చూశాను.

"నాన్న కులాసాగానే ఉన్నారు" అంది అమ్మయ్య అనుకుంటూ.

"రా కూర్చో. ఏం తూర్పు తెల్లారకముందే ఇలా వచ్చావ్?" అన్నాను.

"మరేం లేదు. నీతో ఒక్కమాట చెప్పాలని..."

"అదేమిటే, నిన్ననేగదా వచ్చాను, అప్పుడే చెప్పలేక పోయావా? ఉదయమే పరిగెత్తుకుంటూ వచ్చావ్? ఇంతకూ ఏమిటా రహస్యం?" అన్నాను. తలెత్తి నా వైపు చూసింది. మహా చెడ్డపిల్ల విజయ. వాళ్ళమ్మలాగే మొహం చూసి, మనసులో భావాలు ఇట్టే చదివేయగలదు.

"ఈ మారు ప్రయాణంలో నీ కెక్కడో ఆమె తటస్థ పడినట్టనిపించింది నాకు."

గతుక్కుమన్నాను. ఇంత తెలివైన పిల్ల. అంతా చెప్తే అర్థం చేసుకోలేక పోతుందా అనుకుంటూ ఉత్సాహంగాతలెత్తి చూశాను. నా వైపే. చూస్తోంది విజయ. ఆ పిల్ల మొహంలోని కాఠిన్యాన్ని చూసి నా నోట్లో మాట నోట్లోనే ఉండిపోయింది

"నిజంకాదూ?" అంది.

"అబ్బే మాట వరసకేదో అన్నాను. అది విన్నట్టున్నావు. అంతేనా?" అన్నాను. నవ్వటానికి ప్రయత్నిస్తూ.

"నువ్వేదో దాస్తున్నావు పిన్నీ"

సూటిగా తన వైపు చూడలేక మరిగిన నీరు ఫిల్టర్లోపోసే నెపంతో అటు తిరిగి.

"నీ దగ్గర నాకు దాపరిక మేమిటే పిచ్చితల్లీ" అన్నాను. పాలు కుంపటిమీద పెట్టి ఇటు తిరిగాను.

"అలా అయితే మంచిదే పిన్నీ. అయినా నీతో

# వంచిత

15 వ పేజీ తరువాయి

ఓ మాట చెప్పిపోదామని వచ్చాను. ఆమె అంటే నాన్నకెంత అభిమానమో నాకంత అసహ్యం. ఎలాంటి పరిస్థితుల్లోనూ దాన్ని చెరిపేసుకోలేను నేను. ఆమె నా చిన్నప్పుడే చనిపోయినా నా కింత బాధ, మనోక్లేశం ఉండేవికావు. నాన్న ఇప్పటికే ఆ బెంగతోనే కృశించి పోతున్నాడన్న విషయం నీకూ తెలిసిందే. నాన్న అనుకుంటున్నట్టు ఆమె చనిపోయి ఉంటే మంచిదే. కాని అలా కాక......" అంటూ నా వైపు చూసింది.

"అంతే, అంతే మీ నాన్న అనుకుంటున్నదే నిజమయ్యుంటుంది" అన్నాను. ఆ నిమిషంలో సుమిత్రని కలుసుకున్న నా దురదృష్టానికి నిందించుకున్నాను. సుమిత్ర నిజంగానే చనిపోయిఉంటే ఎంత బావుండేది అని కూడా అనుకోకపోలేదు.

"అది సరే. అలా కాకపోయినప్పటి మాట నేను చెబుతున్నది. ఆమెను చూడాలన్న వాంఛ ఏమాత్రమూ లేదు నాకు. చూస్తే భరించలేనేమో కూడా. నాన్న పరిస్థితి ఏమి బాగా లేదని నీకూ తెలుసు. ఏమాత్రం షాక్ తగలకూడదని డాక్టర్ హెచ్చరించారు. నిన్న నువ్వన్న మాటలకే నాన్న ఎలా అయిపోయాడో నువ్వే చూశావుగా. ఇక ఇపుడు ఎక్కువ సంతోషాన్నిగాని, దుఃఖాన్నిగాని భరించే స్థితిలో లేడు నాన్న. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా ఉనికి ఆమెకు తెలియపర్చవద్దు".

కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది. ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వచ్చాయి విజయ మాటలు.

"నాన్నను కూడా నాకు లేకుండా చెయ్యకు పిన్నీ"

విజయ ఇంతవరకూ ఆపుకున్న కన్నీరు ఇక లోపల ఉండలేనని మారాం చేస్తూ బయటికి రాసాగింది. ముత్యాల్లా బుగ్గలమీద ప్రవహిస్తున్న కన్నీటిని నా కొంగుతో తుడిచాను. ఆ పిల్ల కన్నీటికి, ఎలాగైతేనేం కారకురాలనయిన నా మీద నాకే కోపం వచ్చింది. ఇపుడు పరిస్థితిని చక్కబెట్టవలసిన బాధ్యత కూడా నామీదే పడింది.

"విజయ నోమారు చూడాలని ఉంది" అన్న సుమిత్ర దీన వదనాన్ని నా మనోఫలకం మీదనుంచి తుడిచి వేయటానికే నిశ్చయించుకున్నాను. అంతకన్నా ముఖ్యమయింది విజయ భవిష్యత్తు.

విజయ చుబుకాన్ని పట్టుకుని కళ్ళనీరు తుడుస్తూ,

"అలాంటిదేం జరగదు. నన్ను నమ్ము. నువ్వు నిశ్చింతగా ఉండు. జీవితంలో ఆమెను కలుసుకుంటానేమో నన్న బెంగపెట్టుకోకు" అన్నాను ప్రేమగా, దృఢంగా.

"నమ్మమంటావా" అన్నట్టు నా వైపు చూసింది విజయ.

"నన్ను నమ్ము తల్లీ. నీతో అబద్ధా లెందుకు చెబుతాను నేను......"

సమాధానంగా ఓ నిట్టూర్పు విడిచి లేచి నిల్చుంది విజయ. మొహం ప్రశాంతంగా ఉంది. అది చూసి నా మనసు కుదట బడింది.


"కాఫీ కలుపుతున్నా విజ్జీ. తాగి వెడుదువుగాని లే" అంటున్న నా మాటలు వినిపించుకోకుండా,

"ఇక టైం లేదు పిన్నీ. నాన్న నిద్రలేచేసరికల్లా నే నక్కడ ఉండాలి" అంటూ ఎలా వచ్చిందో అలాగే చకచకా వెళ్ళిపోయింది.

* * *

కోర్కెలకు బానిసయి, పరిస్థితులకు లొంగిపోయి, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా తన బిడ్డను తల్లి ప్రేమనుండి వంచితురాలిగా చేసుకున్న సుమిత్ర ఈనాడు కూతురినుండి ప్రేమను పొందాలని కోరుకోవటంలో అర్థం లేదనిపించిందా క్షణంలో. ఆ కారణంగానే ఈ రోజు తనూ, తన బిడ్డ ప్రేమనుండి దూరమయింది.

అయినా.....అయినా....అప్పుడప్పుడూ నా ఉత్తరానికోసం ఆత్రుతతో ఎదురుచూసే, మాతృప్రేమతో జ్వలించే సుమిత్ర దీనవదనం నన్ను కలత పెడుతూనే ఉంటుంది. కాని అలాంటప్పుడు 'నాన్నను కూడా నాకు దూరం చెయ్యకు పిన్నీ' అన్న విజయ దీనమైన మొహం నా ముందు నిలచి, నేను చేసింది మంచిపనే నన్న సంతృప్తిని కలగ చేస్తుంది నాకు. ★



"మీరేకదండీ డైరక్టరుగారూ! పాత్రతో లీనమై నటించాలని చెప్పింది?"